## నేడు విజయ్ దివస్ వేడుకలు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 8: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నవంబర్ 29న దీక్ష దివస్ ద్వారా తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో..అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన దీక్షతో దిగివచ్చిన కేంద్రం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన రోజును విజయ్ దివస్‌గా నేడు జరుపుకుంటున్నామని బీఆర్ఎస్ పట్ట ణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు (సోమవారం)ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి విజయ్ దివస్ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 8: మండలంలోని రాజన్నపేట, అల్మాస్‌పూర్, బొప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వేములవాడలో జరిగిన సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభను చాటారు. రెండు రోజులుగా వేములవాడలో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన–2024లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. రాజన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ శ్రావణి ఫర్టిలైజర్ పంపింగ్ యంత్రం రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తెలిపారు. అలాగే జిల్లాస్థాయి గణితశాస్త్రం, పర్యావరణ ఎగ్జిబిషన్‌లో అల్మాస్‌పూర్‌కు చెందిన ఎస్ మనస్విని కోడింగ్ డీకోడింగ్ విభాగంలో, బొప్పాపూర్‌కు చెందిన బీ సంపత్ ఆటోమేటిక్ బైక్ ఇండికేటర్, అల్మాస్‌పూర్ కేజీబీవీకి చెందిన జీ శరణ్‌పాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఇచ్చిన ఎగ్జిబిట్స్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట, డిసెంబర్ 8 : మండలంలోని అనంతారం గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం గ్రామస్తులందరూ పోచమ్మ బోనాలు తీశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవత పోచమ్మకు నైవేద్యం పెట్టి బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజన్న ఆలయానికి ఆర్‌జేసీ స్థాయి అధికారిని నియమించాలి

వేములవాడ, డిసెంబర్ 8 : సుమారు 100 కోట్ల ఆదాయం కలిగిఉన్న వేములవాడ రాజన్న ఆలయానికి ఆర్‌జేసీ స్థాయి అధికారిని నియమించాలని వేములవాడ మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ అన్నారు. ఆలయానికి పూర్తిస్థాయి అధికారి లేక భక్తులకు సరైన వసతులు నిర్వహణ, పారిశుధ్యం, కోడెల నిర్వహణ లాంటివి అస్తవ్యస్తంగా ఉందన్నారు. డీసీ, ఏసీ అధికారి కాకుండా పూర్తిస్థాయి రీజినల్ జాయింట్ కమిషనర్ స్థాయి అధికారులు రాజన్న ఆలయానికి నియమించి భక్తుల వసతి సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు మనోభావాలు కాపాడే విధంగా ఆలయాన్ని చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యుత్ ప్రజావాణి ని సద్వినియోగం చేసుకోండి

చందుర్తి/బోయినపల్లి/ కోనరావుపేట/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/ వేములవాడ రూరల్ డిసెంబర్ 8: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సెస్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే 'విద్యుత్ ప్రజావాణి'ని వినియోగదారులు సద్వి నియోగం చేసుకోవాలని సెస్ ఏఈలు మహేశ్, కుమారస్వామి, ప్రశాంత్, దివ్య, పృథ్వి, శ్రీనివాస్ రెడ్డి, వేములవాడ అర్బన్ సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నిబంధనలు పాటిస్తూ గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలి

కలెక్టరేట్, డిసెంబర్ 8 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షలకు హాజరు కావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15,16న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు గ్రూప్–2 పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులకు అవసరమైన మేర పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, డిసెంబర్ 9 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ కోరారు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

తెలంగాణ చౌక్, డిసెంబర్ 8: సిరిసిల్ల పట్టణంలోని మానేరువాగులో దూకి తంగళ్లపల్లి మండలం మండేపల్లికి చెందిన ఎండీ షమీ (43) ఆత్మహత్య చేసుకున్నట్లు టౌన్ ఎస్‌ఐ మల్లేశం ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండేపల్లికి చెందిన షమీ సిరిసిల్ల పట్టణంలో అడ్డామీద కూలీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల తన పెద్దకూతురు వివాహం కోసం చేసిన అప్పుతీరక పోవడం, అలాగే చిన్నకూతురుకు కూడా పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. దీంతో చేతిలో డబ్బులు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన షమీ మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య కౌసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# యూత్ కాంగ్రెస్‌లో వర్గపోరు

- ఆన్‌లైన్ ఎన్నికతో గ్రూపులు
- సీనియర్‌కు గుర్తింపు రాలేదని విమర్శ

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 8: గత బుధవారం జరిగిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడి కోసం జరిగిన ఆన్‌లైన్ ఎన్నికల్లో కొన్ని రోజుల నుంచి తమ అజమాయిషీ నడుస్తుందనుకున్న నాయకులకు మింగుడు పడని ఫలితం వచ్చినట్లు తెలుస్తోంది. 18 నుంచి 35 ఏండ్ల లోపు వయసున్న కార్యకర్తలు యువజన కాంగ్రెస్ నేతను ఎన్నుకునే క్రమంలో మండలంలో ఇద్దరు యువకులు గుండారానికి చెందిన బానోత్ రాజూనాయక్, బొప్పాపూర్‌కు చెందిన పొత్తూరి శివకుమార్ పోటీలో నిలబడ్డారు. సోషల్ మీడియా ఇన్‌చార్జిగా దశాబ్దానికిపైగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న రాజూనాయక్ ఆన్‌లైన్ ఎన్నికల్లో 405 ఓట్లు సాధించగా పొత్తూరి శివకుమార్ 625 ఓట్లు సాధించాడు. దీంతో మండలాధ్యక్షుడిగా శివ ఎంపిక కావడంతో యూత్ కాంగ్రెస్ ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. శివ తనను గెలిపించిన యూత్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ తన మేనమామ ఫీర్‌బాబా ఫొటోను, సంగీతం శ్రీనివాస్‌రావు కుమారుడు శ్రీనాథ్ ఫొటోను ఎడిట్ చేసి శివ తన స్టేటస్‌గా పెట్టుకున్నాడు. అప్పటికే శివపై రగిలిపోతున్న రాజూనాయక్ శివ మేనమామ ఫీర్‌బాబాకు పార్టీతో సంబంధం ఏమిటని దూషిస్తూ ఓ గ్రూపులో పోస్టు చేశాడు. దీంతో రాజూనాయక్‌పై శివ అతని అనుచరులు రగిలిపోతున్నారు. ఇది చివరికి ఎక్కడిదాక దారితీస్తుందోనని కాంగ్రెస్ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

# 'పది' విద్యార్థుల ఆకలి తీరేదెలా?

- పస్తులతోనే ప్రత్యేక తరగతులు
- అల్పాహారం లేక నీరసంగా చదువులు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



కోనరావుపేటలోని పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

కోనరావుపేట, డిసెంబర్ 8: పదో తరగతి విద్యార్థులకు ఆకలి బాధలు తప్పడం లేదు. దీంతో పస్తులతోనే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. ఇప్పటికే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఫలితాలు రాబట్టేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. అందులో భాగంగానే విద్యార్థులకు సాధారణ బోధనతోపాటు సాయంత్రం అదనంగా గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది. ఉదయం బడికి వచ్చిన పిల్లలకు సాయంత్రం వేళ అల్పాహారం, స్నాక్స్ అందించకపోవడంతో ఆకలితోనే తరగతులు వినాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు. ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందించి ఆకలి తీర్చితే మరింత ఉత్సాహంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

### మారిన పాఠశాల వేళలు

జిల్లాలో ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. గత విద్యా సంవత్సరం ఉదయం 9.30 గంటలకు పాఠశాల ప్రారంభం కాగా, ప్రస్తుతం 9 గంటలకే పాఠశాల ఆరంభమవుతోంది. దీంతో పది విద్యార్థులు 9 గంటలకే పాఠశాలకు చేరుకుంటున్నారు. దూర ప్రాంతాలకు చెందినవారు మరో గంట ముందుగానే ఇంటి నుంచి బయల్దేరుతున్నారు. ఇక తోటి విద్యార్థుల మాదిరిగానే మధ్యాహ్నం 12.40 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వీరికి ప్రతి రోజూ సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లేసరికి సాయంత్రం 6.30 గంటలు అవుతుంది. ఈక్రమంలో దూరప్రాంతాల విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు వేళకు రాకపోవడంతో మరింత సమయం పడుతుంది. అంతేకాకుండా ప్రత్యేక తరగతుల్లో ఎలాంటి పోషకాహారం అందించకపోవడంతో ఆకలితో ఆలమటిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఏమాత్రం అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువ మంది ఉండడంతో ఇంటి వద్ద సరైన పౌష్ఠికాహారం అందక, ఆనారోగ్యానికి గురై చదువులో వెనుకబడే అవకాశం ఉంది.

### ప్రభుత్వం చొరవ చూపాలి

జిల్లాలో 109 జిల్లా ఉన్నత పాఠశాలలు, 13 కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు 7, ఒక కేంద్రీయ విద్యాలయం ఉన్నాయి. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో 6,918 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇందులో 3,186 బాలురు, 3,732 మంది బాలికలు ఉన్నారు. గతంలో ప్రభుత్వం చొరవ చూపి పది విద్యార్థులకు అల్పాహారం అందించింది. అంతేకాకుండా పలు గ్రామాల్లో దాతల సాయంతో అల్పాహారం అందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూశారు. కానీ ఈ విద్యాసంవత్సరంలో పది విద్యార్థులు ఆకలితో ఆలమట్టిస్తున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో పాటు దాతలు ముందుకు వచ్చి అల్పాహారం అందించాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా గ్రామాల్లో పుట్టిన రోజులు, పెళ్లిరోజులు జరుపుకునే వారితోపాటు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు ముందుకు వస్తే పది విద్యార్థులకు అల్పాహారం అందిస్తే మేలు జరగనుంది.

### అల్పాహారం అందించాలి



పాఠశాలకు సమయం మారడంతో ఉదయాన్నే పాఠశాలకు వెళుతున్నాం. దీంతో ఇంటి వద్ద అన్నం అవుతే తింటున్నాం. లేదంటే పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తాం. ఇక సాయంత్రం వేళల్లో 5.15 వరకు రోజు వారి సబ్జెక్టు పరంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఆకలి కావడంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సరిగా అర్థ కావడం లేదు. ఖాళీ కడుపుతో పాఠాలు వినడంతో ఏకాగ్రత కోల్పోతున్నాం. దాతలు ముందుకు వచ్చి అల్పాహారం అందిస్తే బాగుంటది.

**-సునయన, పదో తరగతి విద్యార్థిని, కొలనూర్(కోనరావుపేట)**

### ఆకలితోనే చదువు సాగిస్తున్నాం



పొద్దునే పాఠశాలకు ఏమీ తినకుండా వెళుతున్నాం. మధ్యాహ్నం భోజనంతోనే సరిపెట్టుకుంటున్నాం. ఆకలితోనే క్లాస్‌లు వింటున్నాం. దీంతో సాయంత్రం సమయంలో అల్పాహారం అందిస్తే బాగుండేది. ప్రత్యేక తరగతులు వినేటప్పుడు ఒక వైపు ఆకలి, మరోవైపు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాలంటే ఇబ్బందిగా ఉంది. దీంతో నీరసంగా ఉండడంతో ఎప్పుడు ఇంటికి వెళుతామని అనిపిస్తుంది. దాతలు సహకరిస్తే ఆకలి బాధ తీరుతుంది.

**-దావేర జశ్వంత్, పదో తరగతి విద్యార్థి, మామిడిపల్లి(కోనరావుపేట)**

### దాతలు ముందుకు రావాలి



పది విద్యార్థులకు ఇప్పటికే సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. రోజు సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చెబుతున్నాం. దీంతో విద్యార్థులు అల్పాహారం కోసం చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. దాతలు సహకరించి ముందుకు వస్తే విద్యార్థుల ఆకలి తీర్చవచ్చు. పది ఫలితాల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేస్తాం.

**-శ్రీపతి శ్రీనివాస్, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు, కొలనూర్ (కోనరావుపేట)**

# భారీ వర్షం

- బురదమయమైన రహదారులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతోపాటు తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడతోపాటు వివిధ మండలాల్లో వర్షం దంచికొట్టింది. అరగంట పాటు కురిసిన వర్షానికి నేతన్న చౌక్, పాతపెట్రోలు బంక్, సంజీయ్య నగర్ వార్డుల్లోని రోడ్లన్నీ వరద నీటితో మునిగిపోయాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసి వేసినందున ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు.

ఇల్లంతకుంట, డిసెంబర్ 8 : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా వర్షం కరుస్తుండడంతో పత్తి రైతులు పత్తి పంట రంగు మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ, డిసెంబర్ 8 : వేములవాడ పట్టణంలో 3 గంటల ప్రాంతంలో వర్షం పడింది. దీంతో రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు వానలో తడుచుకుంటూ దర్శనాలు చేసుకున్నారు. వర్షం పడుతుండడంతో రాజన్న ఆలయ అనుబంధ దేవాలయాలకు భక్తులు ఉరుకులు, పరుగులతో ఆలయాలకు చేరుకుని దర్శనం చేసుకున్నారు.

కోనరావుపేట, డిసెంబర్ 8: మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురియడంతో అన్నదాత ఆగమవుతున్నారు. పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసిపోవడంతో పాటు పలు చోట్ల ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. అంతేకాకుండా పత్తి తీసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పత్తి తడిసిపోవడంతో నాణ్యత తగ్గిపోతుందని రైతులు అందోళన చెందుతున్నారు.



# పత్తి రైతు చిత్తు

▲ అకాల వర్షానికి తడిసిన పత్తి చేను

- అకాల వర్షంతో దెబ్బ తిన్న పత్తి

చందుర్తి, డిసెంబర్ 8 : ప్రతి ఏటా పత్తి రైతు ఏదో రకంగా చిత్తవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతి కొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడంతోపాటు అకాల వర్షాలతో పత్తి రైతు ఆగమవుతున్నాడు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే ప్రతికూల వాతావరణంలో అంతంత మాత్రమే దిగుబడి రావడంతో పాటు అకాల వర్షాలు అన్నదాతలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లాలో ఈ ఏడాది వాన కాలంలో సుమారు 46,548 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పంటలు ఎదుగుతున్న సమయంలోనే వర్షాలు అధిక మొత్తంలో కురిసి దిగుబడిపై ప్రభావం చూపింది. రెండోసారి రైతులు పత్తి తీయడం మొదలుపెట్టగా మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పత్తి పంట నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### అప్పులే మిగులుతున్నాయి

ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఇవ్వకపోయినా.. అప్పులు చేసి నాకున్న ఆరెకరాలతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌవులు తీసుకొని పత్తి సాగు చేసిన, ఎకరాకు 5నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం గగనమైతోంది. అసలే దిగుబడి అంతంత మాత్రమే రాగా.. అకాల వర్షాలకు పత్తి పంట దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లుతోంది. లాగోడి పోను చివరికి అప్పులే మిగులుతున్నాయి.

**-వట్టిమల్ల సురేశ్, యువ రైతు మూడపల్లి**

# జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



రుద్రంగి: కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి హరిచరన్

రుద్రంగి, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు వేములవాడలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా విద్యాధికారి జగన్మోహన్ చేతుల మీదుగా శనివారం మెమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు మాట్లాడుతూ, జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో దాదాపు 400కు పైగా ప్రదర్శనలో రుద్రంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి హరిచరన్ ప్రదర్శన ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా అధికారుల చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందుకోవడం సంతోషకరమన్నారు. స్కూల్ విద్యార్థి హరిచరన్‌ను కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, గంగనర్సయ్య, పడాల సురేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలెక్టరేట్, డిసెంబర్ 8 : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన కేరళ మోడల్ హైస్కూల్ విద్యార్థుల నమూనాలు నామినేట్ అయ్యాయి. కాగా సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆర్లిన్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృష్ణ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని గుర్తించేలా ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాలకృష్ణ, మహేందర్, బిన్నీ, నరేశ్‌రెడ్డిని అభినందించారు.



కలెక్టరేట్: విద్యార్థిని ఆర్లిన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 8 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజామునుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం క్యూలో వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో భక్తులు అధికసంఖ్యంలో తరలివచ్చారు. వివిధ ఆర్జితసేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.14 లక్షల ఆదాయం సమకూరినట్లు, రాజన్నను దాదాపు 25 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

# వన్‌పల్లి శివారులో చిరుత సంచారం



చిరుత పులి పాదముద్రలు

వీర్నపల్లి, డిసెంబర్ 8: మండలంలోని వన్‌పల్లి పరిధి కేలోత్ తండా శివారు వ్యవసాయ పొలల్లో చిరుత పులి సంచరించడంతో గిరిజన రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. చిరుత పులి పాదముద్రలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా

- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 8: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడతానని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ నిరుద్యోగులకు శాసనమండలి పునరావాస కేంద్రంగా మారిందని, తనకు అవకాశమిస్తే యువత బలమేంటో చూపిస్తానన్నారు. తన ఉద్యోగ ప్రస్థానంలో ఎంతో మంది విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేశానని చెప్పారు. డిసెంబర్ 9లోపు పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ శ్రీనివాసరావు, ఆకునూరి శంకరయ్య, సీ రామరాజు, ప్రతాప్, వంగ వంశీకృష్ణ, శ్రీనివాస్, ఆది మల్లేశ్, వినోద్, సలావుద్దీన్, రాజ్‌కుమార్ ఉన్నారు.

# కొలువుదీరిన మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం



మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్, నాయకులు

రుద్రంగి, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం కొలువుదీరింది. చైర్మన్‌గా చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్‌గా బొజ్జ మల్లేశం, డైరెక్టర్లుగా అమరబండ సాయి కుమార్, గుగులోత్ గజన్, ఎసారి శ్రీనివాస్, కారీం అబ్దుల్, బానాల లావణ్య, మర్రి కిషన్, అల్లూరి సంతోష్, ఇందూరి మధు, గోపిడి రవీందర్, ఏనుగుల లచ్చిరెడ్డి, నాగురం శంకరయ్య, మాడిశెట్టి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చెర్మన్ మానాల మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం కుమార్, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఎస్పీ

- ఫిట్స్ వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసిన అఖిల్ మహాజన్



ప్రథమ చికిత్స అందజేస్తున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

తెలంగాణ చౌక్, డిసెంబర్ 8: సిరిసిల్ల పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో ఫిట్స్ వచ్చి పడిపోయిన వ్యక్తిని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రథమ చికిత్స అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల పట్టణంలో ఉదయం తన్న సిబ్బందితో కలిసి రన్నింగ్‌కు వెళ్తున్న ఎస్పీ బాధితుడు ఫిట్స్ వచ్చి పడిపోవడంతో వెంటనే స్పందించి అతని వద్దకు చేరుకొని సిబ్బంది సహాయంతో చికిత్స అందజేసి అనంతరం దవాఖానకు తరలించారు. ఇక్కడ ఆర్ఎస్ఐ శ్రీనివాస్, డిస్టిక్ గార్డ్స్ ఓంప్రకాశ్, అనుదీప్, రాజ్‌కుమార్, రవికిరణ్, దేవరాజులున్నారు.

# పంపరి శంకర్‌కు పీస్ యూనివర్సిటీ డాక్టరేట్




పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ అందుకుంటున్న పంపరి శంకర్

వేములవాడ టౌన్, డిసెంబర్ 8 : యునైటెడ్ నేషన్స్, ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణానికి చెందిన పంపరి శంకర్‌కు జర్నలిజంతో పాటు సేవా కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పీస్ యూనివర్సిటీ వారు తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలోని జెమ్ పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన డాక్టరేట్ ప్రదాన కార్యక్రమంలో జర్నలిజంలో 25 సంవత్సరాలు సేవలందించడంతోపాటు సేవా కార్యక్రమంలో ఈ అవార్డును యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎస్ చెల్లదురాయి, లక్ష్మీకుండన్, ఎం కదిర్వేల్, రిజిస్ట్రార్ గోపికన్నాన్ చేతుల మీదుగా అందుకున్నారు. పంపరి శంకర్ డాక్టరేట్ అవార్డు పొందినందుకు గాను వారి మిత్రులు, అభిమానులు, మేధావులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి వారికి అభినందనలు తెలిపారు.

# రాజన్న పుణ్యక్షేత్రంలో అయ్యప్ప భక్తిపాట ఆవిష్కరణ



ఆలయం ఎదుట అయ్యప్ప స్వామి సీడీని ఆవిష్కరిస్తున్న పలువురు ప్రముఖులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 8 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కళాకారుడు మారం ప్రవీణ్‌కుమార్ నటించిన అయ్యప్పస్వామి భక్తిపాటను ఆదివారం వేదమంత్రాల మధ్య ఆవిష్కరించారు. ఆలయంలో మొదట లాప్టాప్‌లోని పాటలను కళాకారుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ల పోశెట్టి, కొండ నర్సయ్య,కౌన్సిలర్ మారం కుమార్, రాజన్న ఆలయ మాజీ ధర్మకర్త దుర్శెట్టి అరుణ్‌తేజాచారి ఆవిష్కరించారు. అనంతరం ఆలయం ఎదుట అయ్యప్ప సీడీ లోగోను మాజీ జడ్పీటీసీ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్,కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం ప్రవీణ్‌కుమార్‌ను పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, కళాకారులు అభినందించారు.